# సాక్షి
# భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం, 21, మే, 2025






**ప్రతీ అవకాశాన్ని..**
వచ్చిన ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ రాహుల్ విద్యార్థులకు సూచించారు.
8లో



**పత్తి సాగుకు సై**
ఉమ్మడి జిల్లాలో అడపాదడపా కురుస్తున్న వర్షాలకు దుక్కులు చేస్తున్న రైతులు పత్తి సాగుకు సిద్ధమవుతున్నారు.
8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

**వాతావరణం**
జిల్లాలో బుధవారం ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### వైభవంగా రామయ్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో స్వామివారికి మంగళవారం నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. మంగళవారం సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలను గావించారు.

### రాంబంటుకు పట్టువస్త్రాలు..

కొండగట్టు అంజన్నకు కానుకలు సమర్పించిన భద్రగిరి ఈఓ



భద్రగిరి రామయ్య తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఈఓ, వైదిక సిబ్బంది

భద్రాచలం: కొండగట్టు అంజన్న స్వామికి భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానం అధికారులు మంగళవారం పట్టువస్త్రాలను సమర్పించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని భద్రగిరి రామయ్య తరఫున పట్టువస్త్రాలను, కానుకలను సమర్పించటం కొన్నేళ్లుగా వస్తున్న సంప్రదాయం. ఈ నెల 22న హనుమాన్ జయంతి నేపథ్యంలో ఆలయ ఈఓ ఎల్.రమాదేవి, వైదిక సిబ్బంది కొండగట్టు చేరుకుని పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు.

### ఆర్టీసీకి కార్మికులే మూలస్తంభం

రీజినల్ మేనేజర్ సరిరామ్



అవార్డు గ్రహీతలతో ఆర్టీసీ రీజనల్ మేనేజర్, అధికారులు

మణుగూరు టౌన్: టీజీఎస్ ఆర్టీసీ సంస్థకు కార్మికులే మూలస్తంభమని, అభివృద్ధిలో డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు కీలకపాత్ర పోషిస్తున్నారని ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్ అన్నారు. మంగళవారం మణుగూరు డిపోలో రీజినల్‌స్థాయి ప్రగతి చక్ర అవార్డులను ప్రదానం చేశారు. డ్రైవర్ కేటగిరీలో 10 మందికి, కండక్టర్ కేటగిరీలో ఏడుగురు, టీ డ్రైవర్ కేటగిరీలో ముగ్గురు, మెకానికల్ కేటగిరీలో ముగ్గురు, పీహెచ్‌బీ డ్రైవర్ కేటగిరీలో ఐదుగురికి, ఉత్తమ బస్టాండ్‌గా ఖమ్మం కొత్త బస్టాండ్‌కు, మొత్తం 29 ప్రగతి చక్ర అవార్డులను అందజేసి మాట్లాడారు. అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ మరింత నిబద్ధతతో పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, పర్సనల్ ఆఫీసర్ రామకృష్ణ, అకౌంట్ ఆఫీసర్ బాలస్వామి, డిపోల డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

### స్కూల్ బస్సులు ఫిట్‌గా ఉండాలి

జిల్లా రవాణా అధికారి వెంకటరమణ



నిబంధనల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్టీఓ వెంకటరమణ, తదితరులు

కొత్తగూడెంఅర్బన్: త్వరలో విద్యా సంవత్సరం ప్రారంభంకానున్న నేపథ్యంలో విద్యాసంస్థల బస్సులు ఫిట్‌నెస్‌తో ఉండాలని జిల్లా రవాణాశాఖ అధికారి సూచించారు. జిల్లా రవాణా కార్యాలయంలో స్కూల్ బస్సుల డ్రైవర్లకు బస్సుల ఫిట్‌నెస్, రహదారి భద్రతపై మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి డ్రైవర్ వాహనం నడిపే ముందు ఫిట్‌నెస్ చెక్ చేసుకోవాలని, ప్రతీ వాహనానికి అటెండెంట్ ఉండాలని చెప్పారు. స్కూల్ యాజమాన్యాలు, డ్రైవర్లు బాధ్యతగా ఉండాలని కోరారు. అనంతరం పాటించాల్సిన జాగ్రత్తల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ బస్సుల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# జల రవాణాపై దృష్టి!



దుమ్ముగూడెం మండలంలో కాటన్ ఆనకట్ట దగ్గర జల రవాణా కోసం గతంలో ఉపయోగించిన మార్గం(ఫైల్)

**జలమార్గంపై అధ్యయనం చేస్తామని డిప్యూటీ సీఎం ప్రకటన**

- గతంలో గోదావరిలో రాజమండ్రి–భద్రాచలం– సిరోంచల మధ్య రవాణా
- కేంద్ర ప్రభుత్వ పరిశీలనలోనూ రాజమండ్రి-భద్రాచలం స్ట్రెచ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గోదావరి నదిలో జల రవాణాకు గల అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇటీవల ప్రకటించారు. ఇది కార్యరూపం దాల్చితే జిల్లాలో ఉపాధి, వాణిజ్య రంగాలు మెరుగుపడే అవకాశం ఉంది.

**గతంలో రాజమండ్రి, భద్రాచలం మీదుగా..**

కాకినాడ పోర్టు నుంచి బొగ్గును రైలు మార్గంలో తెలంగాణకు తీసుకొస్తుండగా తెలంగాణ బియ్యాన్ని రోడ్డు మార్గంలో భద్రాద్రి జిల్లా మీదుగానే కాకినాడకు తరలిస్తున్నారు. గోదావరిలో జలరవాణా అందుబాటులోకి వస్తే కాకినాడ పోర్టు నుంచి రాజమండ్రి మీదుగా తెలంగాణలోని భద్రాచలం వరకు సరుకు రవాణాకు అవకాశం ఉంది. గతంలో కాకినాడ – రాజమండ్రి – భద్రాచలం – చర్ల – కాళేశ్వరం (సిరోంచ, మహారాష్ట్ర)ల మధ్య బ్రిటీష్ / నిజాం జమానాలో జల రవాణా నిర్విరామంగా జరిగింది. స్వాతంత్రం వచ్చిన తర్వాత రోడ్డు మార్గాలు విరివిగా అందుబాటులోకి రావడంతో క్రమంగా జలరవాణా కనుమరుగైంది.

**బరాజ్‌ల అండతో**

గోదావరిలో ఏడాది పొడవునా ఏపీలోని వీఆర్ పురం మండలం పోచవరం నుంచి రాజమండ్రి వరకు పడవలు తిరిగేంత నీటి మట్టం ఉంటుంది. ఈ స్ట్రెచ్‌లో పర్యాటకప్రాంతమైన పాపికొండలకు బోట్లు నిత్యం నడుస్తూనే ఉంటాయి. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే, రాజమండ్రి – భద్రాచలం – దుమ్ముగూడెం ఆనకట్ట వరకు జల రవాణాకు అనుకూలమైన నీటిమట్టం ఉండే అవకాశముంది. ఆ పైన సీతమ్మ సాగర్ (నిర్మాణంలో ఉంది), సమ్మక్క సాగర్ బరాజ్‌లతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా లక్ష్మి, పార్వతి, సరస్వతి బరాజ్‌లు ఉన్నాయి. వీటికి పైన మంచిర్యాల – గోదావరిఖని వంటి పారిశ్రామిక ప్రాంతాల నడుమ శ్రీపాదసాగర్ బరాజ్ ఉంది. దీంతో జలరవాణాకు కావాల్సినంత నీటి మట్టం గోదావరిలో అందుబాటులో ఉంటుందని అంచనా వేస్తున్నారు.




**వాటర్ వేస్**

జలరవాణా అభివృద్ధిపై కేంద్రం నుంచి గతంలో అనేక ప్రకటనలు వచ్చాయి. 2008లో యూపీఏ హయాంలో నేషనల్ వాటర్ వేస్ పేరుతో ఓ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో వాటర్ వేస్–4లో భద్రాచలం నుంచి రాజమండ్రి వరకు 171 కి.మీ జల రవాణా మార్గాన్ని ప్రతిపాదించారు. ఆ తర్వాత ఎన్డీఏ ప్రభుత్వం రోడ్, రైల్, రివర్ (ఆర్ ఆర్‌ఆర్) ట్రాన్స్‌పోర్ట్ పేరుతో ఇదే పథకానికి కొత్త రూపు ఇచ్చింది. ఇందులో మహారాష్ట్రలో నాసిక్ నుంచి బంగాళాఖాతం వరకు గోదావరిలో జలరవాణాకు గల అవకాశాలు పరిశీలించాలని నిర్ణయించింది. ఈ మేరకు వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీస్ సర్వీసెస్ (వాప్కోస్) ఆధ్వర్యంలో పలుమార్లు సర్వేలు కూడా జరిగాయి.

**చవక రవాణా**

రోడ్డు, రైలు మార్గాలతో పోల్చితే జలరవాణా చవక. అందువల్లే సముద్ర తీరం ఉన్న రాష్ట్రాలు వ్యాపార, వాణిజ్య రంగాల్లో దూసుకుపోతుంటాయి. తెలంగాణకు సముద్ర తీరం లేకపోవడం లోటుగా ఉంది. దీంతో రాష్ట్ర విభజన తర్వాత డ్రైపోర్టులు అభివృద్ధి చేయాలని నిర్ణయించినా.. ఆశించిన పురోగతి రాలేదు. దీంతో జలరవాణాకు గల అవకాశాలను పరిశీలించే పనిలో ప్రభుత్వం ఉంది. ఇతర దేశాల నుంచి చౌకగా లభించే బొగ్గును కాకినాడ నుంచి తెలంగాణలో ఉన్న విద్యుత్ సంస్థలకు సరఫరా చేయడం, తెలంగాణలో పండిన వరి ధాన్యాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేయడానికి జలరవాణా ఉపయోగపడుతుందని అంచనా వేశారు. కృష్ణా నదిలో జలరవాణా అందుబాటులోకి వస్తే దాని తీర ప్రాంతంలో ఉన్న సిమెంట్ పరిశ్రమలకు మేలు జరుగుతుందనే అంచనాలున్నాయి.

**ప్రతికూలతలు**

కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బరాజ్‌ల భవిష్యత్ ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. సీతమ్మ సాగర్ బరాజ్‌కు ఇంకా అనుమతులు రాలేదు. వీటిపై స్పష్టత వచ్చాకే జల రవాణాపై అడుగులు ముందుకు పడే అవకాశం ఉంది. లేదంటే యూపీఏ, ఎన్డీఏ సర్కార్ల తరహాలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రకటనలు, సర్వేలతో సరిపెట్టే అవకాశముంది. ఒక వేళ ఎగువ ప్రాంతాలను మినహాయించి కాకినాడ – రాజమండ్రి – భద్రాచలం వరకే జలరవాణాకు గల అవకాశాలను పరిగణనలోకి తీసుకుంటే కొంతమేరకు అడుగులు ముందుకు పడే అవకాశముంది. అయినా భద్రాచలంలో స్థల లభ్యతతోపాటు భద్రాచలం – మల్కన్‌గిరి రైల్వేలైనులో పాండురంగాపురం – సారపాక సెక్షన్ల మధ్య రైలు మార్గాన్ని త్వరితగతిన నిర్మించాల్సి ఉంటుంది. గోదావరిలో జలరవాణా మొదలైతే తెలంగాణకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మరింత కీలకంగా మారే అవకాశముంది. స్థానికులకు వ్యాపార, ఉపాధి రంగాల్లో అవకాశాలు మరింతగా మెరుగవుతాయి.

# సర్వే సమస్యకు చెక్ పెట్టేలా..

- నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చేలా ప్రభుత్వ చర్యలు
- భూభారతి చట్టం అమలుతో పెరగనున్న అవసరాలు
- లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా గుర్తింపుతో యువతకు ఉపాధి
- ఉమ్మడి జిల్లాలో 1,073 మంది నుంచి దరఖాస్తులు



భూ సర్వే నిర్వహిస్తున్న సర్వేయర్లు(ఫైల్)

చుంచుపల్లి: భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూముల అమ్మకాలు, కొనుగోళ్లలో సర్వే మ్యాప్‌ను తప్పనిసరి చేసింది. ప్రతీ వ్యవసాయ క్షేత్రానికి హద్దులు నిర్ణయించే భూ నక్ష ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం కొత్తగా తెచ్చిన భూ భారతి చట్టంలో ప్రత్యేక క్లాజ్‌ను పొందుపర్చింది. ఈ నేపథ్యంలో సర్వేయర్ల అవసరం పెరగనుండగా, శిక్షణ ఇచ్చి లైసెన్స్‌డ్ సర్వేయర్లను ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో భూ వివాదాల పరిష్కారంతో పాటు నిరుద్యోగులకు కొంత మేర ఉపాధి లభించే అవకాశం ఉంది. ఈ నెల 8 నుంచి 17 వరకు మీ సేవా కేంద్రాల దరఖాస్తులు స్వీకరించగా.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,073 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఖమ్మం జిల్లాలో 647 దరఖాస్తులు రాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 426 మంది దరఖాస్తులు వచ్చాయి. వీరందరికీ భూ సర్వేపై శిక్షణ ఇచ్చి, లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా గుర్తించనున్నారు. వీరు భూమి రిజిస్ట్రేషన్‌కు ముందు స్కెచ్ తయారు చేసి పోర్టల్లో అప్‌లోడ్ చేస్తారు. అనంతరం ప్రభుత్వ సర్వేయర్లు పూర్తిస్థాయిలో పరిశీలించాక సంబంధిత జిల్లా అధికారి ఆమోదముద్ర వేస్తారు. ఉమ్మడి జిల్లాలోని 44 మండలాల్లో ప్రస్తుతం 37 మంది సర్వేయర్లు మాత్రమే పనిచేస్తున్నారు. దీనివల్ల భూముల సర్వేకు నెలల తరబడి రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్లను ఏర్పాటు చేయనుండటంతో సర్వేల్లో జాప్యం తగ్గే అవకాశం ఉంటుంది.

**50 రోజులపాటు శిక్షణ**

దరఖాస్తులను పరిశీలించాక అభ్యర్థులను ఎంపిక చేసి, ఈ నెల 26 నుంచి 50 రోజులపాటు శిక్షణ ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా నిజాం పాలనలో మాత్రమే సెత్వార్ పేరిట సర్వే నిర్వహించారు. ఆ సమయంలో రెవెన్యూ గ్రామాల వారీగా పట్టాదారుల సమాచారంతో ఖాస్రా పహాణీ తయారు చేసి అందుబాటులో ఉంచారు. రెవెన్యూశాఖ దానినే ప్రామాణికంగా పరిగణిస్తూ వస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖాస్రా పహాణీ ఆధారంగా భూ దస్త్రాల ప్రక్షాళన కార్యక్రమం చేపట్టింది. భూ హద్దులను గుర్తించేలా సర్వే చేయకపోవడంతో వివాదాలు అలాగే కొనసాగుతున్నాయి. వీటి శాశ్వత పరిష్కారానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**ఉమ్మడి జిల్లాలో వచ్చిన దరఖాస్తులు**

| కేటగిరీ | ఖమ్మం | భద్రాద్రి | మొత్తం |
|---|---|---|---|
| ఓసీ | 26 | 05 | 31 |
| బీసీ | 232 | 69 | 301 |
| ఎస్సీ | 182 | 73 | 255 |
| ఎస్టీ | 207 | 279 | 486 |
| మొత్తం | 647 | 426 | 1,073 |

**26 నుంచి శిక్షణ..**



లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,073 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 26 నుంచి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. దాదాపు 50 రోజులపాటు మూడు దశల్లో అవగాహన కల్పిస్తాం.

– శ్రీనివాసులు, అసిస్టెంట్ డైరెక్టర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్

### 22న బాక్సింగ్ పోటీలు

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు సబ్ జూనియర్స్, జూనియర్స్, యూత్ విభాగాల్లో మంచిర్యాల జిల్లాలో టైసన్ కప్ స్టేట్ ఓపెన్ బాక్సింగ్ చాంపియన్ షిప్ నిర్వహించనున్నట్లు బాక్సింగ్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ, కోచ్ జి.ఈశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో 7 విభాగాల్లో ఎంపిక చేసి గోవాలో జరిగే జాతీయ ఓపెన్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. అర్హులు ఈ నెల 22న కొత్తగూడెం ప్రగతి మైదానంలో జరిగే పోటీలకు హాజరు కావాలని కోరారు.

# వైద్యులు, సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం

- బూర్గంపాడు సీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ
- పనితీరు మారకపోతే బదిలీ చేస్తామని హెచ్చరిక



బూర్గంపాడు సీహెచ్‌సీ వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్



రాజుపేట గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్, పక్కన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపాడు : 'ఆస్పత్రిలో వైద్యసేవలు అందించేందుకు సూపరింటెండెంట్, వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండరు. అశ్వారావుపేట, మణుగూరు, ఇల్లెందు ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరుగుతుంటే బూర్గంపాడులో గుండుసున్న. ఇదే లాస్ట్ వార్నింగ్. మార్పురాకపోతే దూర ప్రాంతాలకు బదిలీ చేస్తాం. ప్రజలు కలెక్టరేట్‌కు రాకుంటే, నేనే ప్రజల్లోకి వెళ్లి సమస్యలు తెలుసుకుంటా. డెలివరీ కేసుల సంఖ్య పెంచేలా మీరు ఎందుకు గ్రామాలకు వెళ్లడంలేదు. బూర్గంపాడు సీహెచ్‌సీ మ్యూజియంలా మారింది. ప్రజలు రావడంలేదని చెబుతున్నారు. మరి ఆస్పత్రిని మూసేద్దామా' అంటూ కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెలాఖరు వరకు 20 ప్రసవాలు చేయాలని లక్ష్యం నిర్దేశించారు. మంగళవారం ఆయన బూర్గంపాడు సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో నర్సులు, సెక్యూరిటీ సిబ్బంది మాత్రమే ఆస్పత్రిలో ఉండటంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అనంతరం అక్కడకు చేరుకున్న సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోకుంటే అందరినీ బదిలీ చేస్తామని హెచ్చరించారు. అనంతరం బూర్గంపాడులోని తెలంగాణ గురుకుల పాఠశాల (బాలికలు)ను కలెక్టర్ తనిఖీ చేశారు. గురుకుల పాఠశాలలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రహరీల నిర్మాణం, సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి విద్యార్థుల భద్రతకు చర్యలు చేపట్టాలన్నారు.

**ప్రజల ఆదరణ పొందాలి**

మణుగూరు టౌన్: ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించి, ప్రజల ఆదరణ పొందాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం ఆస్పత్రిలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలని, బాధితులను చులకన భావంతో చూడొద్దని చెప్పారు. అనంతరం మున్సిపాలిటీలోని రాజుపేట, విఠల్‌రావునగర్ ఏరియాల్లో పర్యటించారు. సింగరేణి హద్దులను పరిశీలించారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. బొగ్గు, ఇసుక లారీలతో దుమ్ము, ధూళి వల్ల ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంగా చేయగా, తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనా నిర్మించుకోలేని పరిస్థితి ఉందని, ఈ రెండు గ్రామాలను సింగరేణి మణుగూరు ఓసీ విస్తరణలో తీసుకుని మరోచోట పునరావాసం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సీపీఐ రాష్ట్ర నాయకుడు అయోధ్య, డీసీహెచ్‌ఎస్ రవిబాబు, ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్, వైద్యుడు గౌరీ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

### రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ త్రినాథ్‌బాబు

కొత్తగూడెంఅర్బన్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందేలా చర్యలు తీసుకుంటున్నామని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ త్రినాథ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో యాసంగి 2024–25 సీజన్‌లో 144 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 39,072.080 మెట్రిక్ టన్నుల ధాన్యం 5,685 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామని, ఇందుకు రూ.90.41 కోట్లను రైతులకు చెల్లించామని పేర్కొన్నారు. గత యాసంగి 2023–24 సీజన్‌లో రూ.27.18 కోట్లతో 12,447.220 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటివరకు 4,761 మంది రైతుల నుంచి రూ.77.36 కోట్ల విలువైన 33,434.680 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు.

# 'నకిలీ'లతో జాగ్రత్త!

- విత్తన కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలి
- ఆఫర్లు, మాయమాటలను నమ్మి మోసపోవద్దు
- రశీదులు, ఖాళీ ప్యాకెట్లు భద్రపరుచుకోవాలి
- జూన్ నుంచి ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభం



దుకాణంలో విత్తనాలను తనిఖీ చేస్తున్న అధికారులు(ఫైల్)

బూర్గంపాడు/పాల్వంచరూరల్/చర్ల: జూన్ నుంచి ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభంకానుడటంతో రైతులు వానాకాలం పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఆరుగాలం శ్రమించినా ఫలితం దక్కాలంటే రైతులు ఆది నుంచే అప్రమత్తంగా ఉండాలి. దుక్కులు దున్నడం దగ్గర నుంచి పంట దిగుబడి చేతికి వచ్చే వరకు అన్ని జాగ్రత్తలు పాటించాలి. విత్తన ఎంపికలో అప్రమత్తంగా లేకపోతే ఆర్థికంగా నష్టపోతారు. నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులతో టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేయనున్నారు.

**ఊరు, పేరులేని విత్తనాలను అంటగడతారు..**

ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో నాణ్యత లేని, ఊరుపేరు లేని వరి, పత్తి, మిర్చి విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. అధిక దిగుబడి ఇస్తుందంటూ, కొత్తరకం అంటూ మాయమాటలతో మభ్యపెడుతున్నారు. నకిలీ విత్తనాలు విక్రయించి ఏటా రైతులను మోసం చేస్తున్నారు. తక్కువ ధరలు, ఆఫర్లు అంటు కొందరు డీలర్లు నాణ్యతలేని విత్తనాలను విక్రయిస్తున్నారు. గతంలో పలు ప్రాంతాల్లో నకిలీ విత్తనాలు కొని రైతులు మోసపోయారు. గతేడాది కోడిపుంజుల వాగు గ్రామ రైతులకు పాల్వంచలోని విత్తన వ్యాపారి నకిలీ వరి విత్తనాలు విక్రయించాడు. పంట నష్టపోయిన రైతులు ఆందోళన చేయగా సంబంధిత కంపెనీ నష్టపరిహారం చెల్లించింది. చంద్రుగొండ, సుజాతనగర్ మండలాల్లో కూడా నాణ్యత లోపం కలిగిన వరి విత్తనాలు విక్రయించారు. పాండురంగాపురంలో నకిలీ మిర్చి, పత్తి విత్తనాలు కొనుగోలుచేసి పలువురు రైతులు దగాపడ్డారు. సూరారం, జగన్నాథపురం, కోడిపుంజుల వాగులో నాణ్యతలేని వరి విత్తనాలను కొనుగోలుచేసి మోస పోయారు.

**బ్రాండెడ్ కంపెనీల ప్యాకెట్లలో నకిలీ విత్తనాలు..**

నిషేధిత గ్లైసిల్, బీటీ, బీటీ–3తో పాటుగా అనుమతులులేని కొన్ని కంపెనీల పత్తి విత్తనాలు గతంలో జిల్లాలో విక్రయించారు. గుంటూరు, మాచర్ల ప్రాంతాల నుంచి, జిన్నింగ్ మిల్లుల నుంచి నకిలీ విత్తనాలు తెప్పించి, బ్రాండెడ్ కంపెనీల ప్యాకెట్లలో నింపి విక్రయించారు. బ్రాండెడ్ కంపెనీలకు చెందిన గడువు ముగిసిన విత్తనాలు కూడా కొత్తగా ప్యాకింగ్ చేసి విక్రయించిన ఘటనలు ఉన్నాయి. గతంలో నకిలీ విత్తనాలు విక్రయించిన పలువురు వ్యాపారులు జైలు పాలయ్యారు.

**అవగాహన కల్పిస్తున్నాం**



విత్తన కొనుగోళ్లపై ప్రతి మంగళవారం రైతువేదికల్లో అవగాహన కల్పిస్తున్నాం. రశీదులు, ప్యాకెట్లను భద్రపరుచుకోవాలి. అనుమతి ఉన్న దుకాణాల్లో మాత్రమే కొనాలి. గ్రామాల్లో తిరుగుతూ విత్తన ప్యాకెట్లు బుక్ చేసేవారికి దూరంగా ఉండాలి. 450 గ్రాముల బ్రాండెడ్ విత్తన ప్యాకెట్ ధర రూ. 901గా ప్రభుత్వం నిర్ణయించింది. అంతకుమించి ఎక్కువ ధర చెల్లించవద్దు. నకిలీ విత్తనాలు అమ్మిన వ్యాపారులపై పీడీ యాక్టు కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

– బాబూరావు, వ్యవసాయశాఖ జిల్లా అధికారి

### రైతు సంఘాల నాయకులు ఏం కోరుతున్నారంటే..

- నకిలీ విత్తనాల ఉత్పత్తి, నియంత్రణకు కఠినమైన నిబంధనలు అమలు చేయాలి.
- మార్కెట్‌లో నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించేలా చర్యలు తీసుకోవాలి.
- తనిఖీలు చేపట్టేందుకు రెగ్యులేటరీ సంస్థలు ఏర్పాటు చేయాలి. విత్తన కంపెనీలు, పంపిణీదారులపై ప్రత్యేక నిఘా ఉంచాలి.
- నకిలీ విత్తనాల వల్ల కలిగే నష్టాలపై క్షేత్రస్థాయిలో అవగాహనా సదస్సులు జరపాలి.
- గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాలో విత్తన విక్రయాలకు అనుమతి పొందిన కంపెనీలు, డీలర్ల వివరాలను, ఏయే కంపెనీ విత్తనాలు ఎంత ధర అనే విషయాలను రైతులందరికీ తెలిసేలా గ్రామాల్లో, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయాలి.

**విత్తనం కొనే ముందు...**

రైతులు వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్ నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలి. సీల్ చేసిన బస్తాలను ధ్రువీకరణ(ట్యాగ్) ఉన్న వాటినే ఎంపిక చేసుకోవాలి. విత్తన బస్తాపై ప్యాకెట్లపై గడువు తేదీ, రకం పేరు, లాట్ నంబర్లు చూసుకోవాలి. కొనుగోలు బిల్లుతోపాటు విత్తన రకం, గడువు తేదీ ఉండేలా డీలర్ సంతకంతో కూడిన రశీదు మాత్రమే తీసుకోవాలి. కొనుగోలు చేసిన రైతు సంతకం కూడా బిల్లుపై ఉండేలా చూసుకోవాలి.

## క్లుప్తంగా

### ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తప్పులు సరిదిద్దుకోండి



విచారణ చేస్తున్న హౌజింగ్ పీడీ శంకర్

చంద్రుగొండ: ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో లబ్ధిదారుల పేర్లల్లో తప్పులు ఉంటే సరిదిద్దుకోవాలని జిల్లా హౌజింగ్ పీడీ శంకర్ సూచించారు. మండలంలోని బెండాలపాడు గ్రామంలో మంగళవారం ఆయన ఇంటింటికీ తిరిగి లబ్ధిదారుల జాబితాను పరిశీలించి మాట్లాడారు. తప్పులున్న వారి జాబితాను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, ఆయన ఆదేశాల మేరకు వాటిని సరిదిద్దుతామని వెల్లడించారు. ఆయన వెంట దిశ కమిటీ సభ్యుడు బొర్రా సురేశ్, పంచాయతీ కార్యదర్శి రోహిత్, ఏఈలు రాము, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

### సరళమైన పద్ధతిలో బోధించాలి



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరరావు

పాల్వంచ: ఉపాధ్యాయులు ప్రతి సబ్జెక్ట్‌లో మెళకువలు నేర్చుకుని, సరళమైన పద్ధతిలో విద్యార్థులకు బోధించాలని డీఈఓ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక కొమ్ముగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి భౌతిక, రసాయనశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని, సబ్జెక్ట్‌లను పూర్తిగా అవగాహన చేసుకుని, విద్యార్థులు అవపోసన పట్టే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోర్స్ కోఆర్డినేటర్ ఎస్.సైదులు, డీఆర్‌పీలు సంపత్, ప్రభుసింగ్, అపక శంకర్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### అత్యవసర సర్వీసులపై అవగాహన



పరికరాల పనితీరును వివరిస్తున్న మేనేజర్

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం సీహెచ్‌సీకి ఇటీవల 108, 102 నియోనేటల్ అంబులెన్స్ సేవలు మంజూరయ్యాయి. ఆయా వాహనాల్లో ఉన్న అత్యాధునిక పరికరాల వినియోగంపై అత్యవసర సేవల ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శివకుమార్ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. సీహెచ్‌సీకి మంగళవారం వచ్చిన ఆయన అంబులెన్స్‌ల్లోని సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృపా ఉషశ్రీ ఉద్యోగులు దుర్గాప్రసాద్, శ్రీనివాస్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

### విశ్రాంత ఉద్యోగి మృతదేహం లభ్యం

సుజాతనగర్: మండలంలోని డేగలమడుగు సమీప పంట పొలాల్లో ఓ మృతదేహం ఉందనే సమాచారంతో పోలీసులు మంగళవారం విచారణ చేపట్టారు. ఈమేరకు పాల్వంచ టీచర్స్ కాలనీకి చెందిన పోస్టల్ విశ్రాంత ఉద్యోగి షేక్ ఖాసిం(61)గా గుర్తించారు. కాగా, డేగలమడుగు వాసులకు సోమవారం కనిపించిన ఆయన మంగళవారం మధ్యాహ్నానికి మృతదేహంగా మారాడు. ఖాసిం మరణంపై ఎలాంటి అనుమానం లేదని, అనారోగ్యంతో మృతి చెందాడని ఆయన కుమార్తె షేక్ మౌలాబీ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.రమాదేవి తెలిపారు.

### దాడులకు పాల్పడడం హేయమైన చర్య



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు

ఖమ్మంమామిళ్లగూడెం: ఆపరేషన్ సిందూర్ విజయవంతం సందర్భంగా సైనికుల త్యాగాలు, కేంద్ర ప్రభుత్వ ఘనతను కీర్తిస్తూ ఖమ్మంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తుంటే విచ్ఛిన్నం చేసేలా కొందరు దాడులకు పాల్పడటం గర్హనీయమని బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ దేశ ప్రతిష్టను పెంచిన జవాన్ల వీరోచిత పోరాటాన్ని కొనియాడుతూ చేపట్టిన ర్యాలీకి మద్దతు తెలపాల్సింది పోయి మత విద్వేషాలను రెచ్చగొట్టడం బాధాకరమని తెలిపారు. ఈమేరకు జాతీయవాదులపై దాడి చేసిన వారిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని ఆయన కోరారు. ఈసమావేశంలో నాయకులు నున్నా రవికుమార్, ఈ.వీ.రమేష్, సన్నే ఉదయ్‌ప్రతాప్, అల్లిక అంజయ్య, నంబూరి రామలింగేశ్వరరావు, రవిరాథోడ్, బెనర్జీ, నల్లగట్టు ప్రవీణ్‌కుమార్, ధనియాకుల వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి సాగుకు సై!

**దుక్కులు సిద్ధం చేస్తున్న రైతులు**

- ఉమ్మడి జిల్లాలో 4.27 లక్షల ఎకరాల్లో సాగు అంచనా
- 9 లక్షలకు పైగా విత్తన ప్యాకెట్ల అవసరం
- త్వరలోనే డీలర్లతో భేటీ. విక్రయాలకు అనుమతి



బూర్గంపాడులో ట్రాక్టర్‌తో దుక్కి చేయిస్తున్న రైతు



ఖమ్మంలోని ఓ ఫర్టిలైజర్ షాప్ వద్ద పత్తి విత్తన కంపెనీల బోర్డులు

ఖమ్మంవ్యవసాయం: పత్తి సాగుకు సమయం సమీపిస్తోంది. కొద్దిరోజులుగా అడపాదడపా కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు దుక్కులు దున్నే పనిలో నిమగ్నమయ్యారు. ఈ నెల 27వ తేదీ నాటికి దేశంలోకి ఆ తర్వాత, కొద్ది రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయని వాతావరణ విభాగం అధికారులు చెబుతున్నారు. తొలకరి వర్షాలు కురవగానే రైతులు పత్తి సాగుపై దృష్టి సారించనుండడంతో అవసరమైన ఏర్పాట్లకు వ్యవసాయ శాఖ సన్నాహాలు చేస్తోంది.

**పెరిగిన విత్తన ధరలు**

ఈ ఏడాది ఖమ్మం జిల్లాలోని 2.13 లక్షల ఎకరాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2.14 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయ శాఖ ప్రణాళికలో పేర్కొంది. ఎకరాకు 450 గ్రాములవి రెండు విత్తన ప్యాకెట్లను వినియోగిస్తారు. ఉమ్మడి జిల్లా రైతులకు అవసరమైనవే కాక అదనంగా కలిపి 10.10 లక్షల మేర ప్యాకెట్లను సమకూర్చాలని భావిస్తున్నారు. ఇప్పటికే వివిధ విత్తన కంపెనీల నుంచి ఖమ్మం జిల్లా డీలర్లు 36,279 ప్యాకెట్లు, భద్రాద్రి జిల్లా డీలర్లు 1.83 లక్షల ప్యాకెట్ల విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక్కడి నేలలకు అనుకూలమైన నూజివీడు, తులసి, యూఎస్, రాశి, ఆశ, డాక్టర్ బెంట్, నీరజ, అంకూర్, కావేరి తదితర కంపెనీ విత్తనాలను అమ్మేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కాగా, గత ఏడాది 450 గ్రాముల విత్తన ప్యాకెట్ ధర రూ.864 ఉండగా, ఈ ఏడాది రూ.37 పెంచి రూ.901గా నిర్ణయించారు.

**ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు ప్రణాళిక**

| జిల్లా | సాగు (ఎకరాల్లో) | విత్తనాలు (ప్యాకెట్లు) | అందుబాటులో ఉన్నవి |
|---|---|---|---|
| ఖమ్మం | 2.13లక్షలు | 4.82 లక్షలు | 37 వేలు |
| భద్రాద్రి | 2.14లక్షలు | 4.84 లక్షలు | 1.83లక్షలు |

**త్వరలోనే డీలర్లతో సమావేశం**

పత్తి సీజన్ సమీపిస్తున్న వేళ విత్తన విక్రయాలపై డీలర్లతో సమావేశం నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారులు నిర్ణయించారు. నాణ్యమైన విత్తనాల విక్రయం, ఇందులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రిజిస్టర్ల నిర్వహణ, ధరలు, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడంపై దిశానిర్దేశం చేయనున్నారు. సమావేశంలో విత్తన విక్రయాలకు ఇచ్చే అనుమతులపైనా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

**టాస్క్‌ఫోర్స్ బృందాల ఏర్పాటు**

నకిలీ పత్తి విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా అరికట్టేలా మండలాలు, డివిజన్ల వారీగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయనున్నారు. మండల, డివిజన్, జిల్లాస్థాయిలో ఏర్పాటుచేసే ఈ బృందాల్లో వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులను సభ్యులుగా నియమిస్తారు. జిల్లాస్థాయి బృందాల్లో ఏడీఏ, డీఎస్పీ లేదా సీఐ, అగ్రికల్చర్ యూనివర్సిటీ అధికారి, డివిజన్‌స్థాయి కమిటీలో ఏడీఏ, ఎంఈఓ, మండలస్థాయి కమిటీలో ఏఓ, ఎస్‌ఐలు, రెవెన్యూ సిబ్బంది ఉంటారు. అనుమతి లేకుండా గ్రామాల్లో విత్తనాలు అమ్మే దళారులు.. అక్రమాలకు పాల్పడే డీలర్లపై నిఘా వేసి రైతులు మోసపోకుండా చర్యలు తీసుకుంటారు.

**త్వరలోనే భేటీ, అనుమతులు**



పత్తి సాగు చేసే రైతులకు అవసరమైన విత్తనాలు సమకూర్చనున్నాం. లైసెన్స్‌డ్ డీలర్ల వద్ద అందుబాటులోకి తీసుకొస్తాం. అయితే, ఇంకా విత్తన విక్రయాలకు అనుమతులు ఇవ్వలేదు. త్వరలోనే డీలర్లతో సమావేశం నిర్వహించి విక్రయాలకు చర్యలు తీసుకుంటాం. అలాగే, నకిలీ విత్తన విక్రయాలను సమర్థవంతంగా నిలువరించేలా టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేస్తాం.

–ధనసరి పుల్లయ్య, ఖమ్మం డీఏఓ

# శిథిలావస్థలో సీఎంపీఎఫ్ కార్యాలయం

- 1985లో నిర్మాణం
- పర్యవేక్షణ కరువు.. నాణ్యతా లోపం..
- క్వార్టర్లదీ అదే పరిస్థితి



సీఎంపీఎఫ్ భవనం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని సీఎంపీఎఫ్ (కొత్తగూడెం రీజియన్) భవనం శిథిలావస్థకు చేరింది. 1985లో సీఎంపీఎఫ్ సెంట్రల్ కార్యాలయం వారు కేటాయించిన నిధులతో సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టర్ ద్వారా నిర్మించిన ఈ భవనాన్ని 1987లో ఆనాటి సీఎంపీఎఫ్ కమిషనర్ శంకర్ ప్రసాద్ ప్రారంభించారు. 40 ఏళ్లకే పూర్తి శిథిలావస్థకు చేరిందంటే కాంట్రాక్టర్ కట్టిన నాణ్యత ఇట్టే అర్థం అవుతుంది. అంతే కాకుండా సివిల్ అధికారుల పర్యవేక్షణ, అధికారుల నిబద్ధత గురించి కార్మికులు గుసగుసలాడుతున్నారు. రీజియన్ పరిధిలో పనిచేస్తున్న కార్మికుల భవిష్యనిధి అంటే సుమారు 20 వేల మంది కార్మికుల భవితవ్యం ఈ కార్యాలయంలో ఉంటుంది. కార్పొరేట్ ఏరియాకు కూతవేటు దూరంలోనే సివిల్ జీఎంలతోపాటు, ఇతర ఉన్నతాధికారులు ఉండే కార్యాలయ నిర్మాణం ఈవిధంగా ఉందంటే ఇతర ఏరియాలలో కాంట్రాక్టర్లు నిర్మించి భవనాల తీరు ఏవిధంగా ఉంటుందో, ఎంత నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారో అర్థం అవుతుందని కార్మికులు చర్చించుకుంటున్నారు.

**పెచ్చులు ఊడి పడుతున్న స్లాబ్..**

భవనంలో స్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళనలతో ఉద్యోగులు ఇటీవల పక్కనే ఉన్న మరో కార్యాలయంలోకి మారారు. అయినా సింగరేణి అధికారులు పట్టించుకోవటం లేదు. ఇదిలా ఉండగా, సీఎంపీఎఫ్ కార్యాలయం వెనక సింగరేణి కాంట్రాక్టర్లు నిర్మించిన క్వార్టర్లు కూడా ఇదే పరిస్థితి. ఇటీవల కాలంలో మరమ్మతులు చేశారు. అయినా మార్పు లేదని, ఉద్యోగులు గమనించి బయట కిరాయికి ఉంటున్నారు. క్వార్టర్లు ఉండి ఉద్యోగులు బయట కిరాయికి ఉండటం గర్హనీయం. ఈ భవనం, క్వార్టర్ల కోసం సుమారు 40 ఏళ్ల క్రితం ఆనాటి ఎస్టేట్స్ అధికారులకు సుమారు 5 ఏకరాల స్థలాన్ని లీజ్‌కు లీజుకు ఇచ్చింది. కార్మికుల భవిష్యనిధి వివరాలు, సీఎంపీఎఫ్ పేరిట వసూలు అవుతున్న కోట్లాది రుపాయల లెక్కలు ఉండే కార్యాలయం, క్వార్టర్ల మెయింటునెన్స్‌ను కంపెనీ పట్టించుకోకపోవటం విచారకమని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేట్ అధికారులు సీఎంపీఎఫ్ కార్యాలయం, క్వార్టర్లపై దృష్టి సారించి మరమ్మతులు చేయించి, ఉద్యోగులకు ఇవ్వాలని లేదంటే పట్టణం నడిబొడ్డున ఉన్న ఈ క్వార్టర్ల స్థలం కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉందని కార్మికులు అంటున్నారు.

## 'సంపన్నులకే సంపద పంచుతున్న కేంద్రం'

ఖమ్మంమయూరిసెంటర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం దేశ సంపదను పెట్టుబడిదారులకు దోచిపెడుతోందని అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. దేశవ్యాప్త నిరసనలో భాగంగా ఖమ్మం పాత ధర్నాచౌక్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఐదు శాతంగా ఉన్న కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారుల చేతుల్లో 70 శాతం దేశసంపద ఉందని ఆరోపించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీ నెరవేర్చకుండా నిరుద్యోగ భారత్ గామారుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎన్.నరేష్‌నాయుడు, గాదె లక్ష్మీనారాయణ, తుమ్మావిష్ణువర్ధన్, జి. రామయ్య షేక్ సుభాని, కొత్తా సీతారాములు, నున్నా నాగేశ్వరరావు, కొండపర్తి గోవిందరావు, మలీదు నాగేశ్వరరావు, ఎండీవై.పాషా, మందుల రాజేంద్రప్రసాద్, పాల్వంచ కృష్ణ, శింగు నరసింహారావు, బీ.జీ.క్లైమెంట్, తోట రామాంజనేయులు, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ట్యాంక్‌బండ్ల నిర్మాణానికి రూ.30.60 కోట్లు

మధిర: మధిర నియోజకవర్గంలోని ఆరు చెరువులను ట్యాంక్‌బండ్లుగా అభివృద్ధి చేసేందుకు రూ.30.60 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. చింతకాని చెరువుకు రూ.7.90 కోట్లు, మాటూరుకు, రూ.90లక్షలు, చిరుమర్రి చెరువుకు రూ.2.90 కోట్లు, ముత్తారం చెరువు అభివృద్ధికి రూ.8.95 కోట్లు, కలకోటకు రూ.7.05కోట్లు, బయ్యారం చెరువుకు రూ.2.90 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చెరువుల అభివృద్ధితో నీటి నిల్వ సామర్థ్యం పెరగడమే కాక స్థానికులకు ఆహ్లాదం అందుతుందని, నిధులు మంజూరు చేయించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## కుమార్తెకు ఓణీల ఫంక్షన్ చేసి..

**మరుసటిరోజు గుండెపోటుతో తండ్రి మృతి**



వెంకటేశ్వర్లు (ఫైల్)

జూలూరుపాడు: తన కుమార్తెకు ఓణీల ఫంక్షన్ చేసిన తండ్రి మరుసటిరోజే గుండెపోటుతో మృతిచెందిన విషాద ఘటన మండలంలోని అనంతారంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మల్కం వెంకటేశ్వర్లు (55) ఓ ప్రైవేట్ బస్సుడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం తన చిన్న కుమార్తె నాగపంచమి ఓణీల ఫంక్షన్ చేశారు. మంగళవారం ఉదయం గుండెపోటుతో వెంకటేశ్వర్లు మృతి చెందడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది. మృతుడికి భార్య బాపమ్మ, ఇద్దరు కుమార్తెలు నాగప్రసన్న, నాగపంచమి ఉన్నారు.

## అనారోగ్యంతో బాలింత మృతి



సిద్దెల శ్రావణి (ఫైల్)

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల గ్రామానికి చెందిన బాలింత సిద్దెల శ్రావణి (21) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. రెండేళ్ల కిందట కాకర్ల గ్రామానికి చెందిన సిద్దెల కిశోర్‌కు కల్లూరు మండలం చిన కోరుకొండకు చెందిన శ్రావణితో వివాహమైంది. అనంతరం గర్భం దాల్చడంతో కాన్పు కోసం పుట్టింటికి వెళ్లింది. నెల రోజుల కిందట ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే, శ్రావణి పది రోజులుగా జ్వరంతోపాటు తీవ్ర రక్తస్రావం అవుతుండటంతో అక్కడ ఆసుపత్రిలో చేరింది. అయినా తగ్గకపోవడంతో భర్త కిశోర్ ఆమెను కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శ్రావణి మంగళవారం మృతిచెందింది.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గుండాల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఆళ్లపల్లి ఎస్‌ఐ సోమేశ్వర్ కథనం ప్రకారం.. కాచనపల్లి గ్రామానికి చెందిన పరిషక లక్ష్మయ్య (45 )సోమవారం సాయంత్రం మద్యం తాగి రావడంతో భార్య మందలించింది. మనస్తాపానికి గురై గ్రామ సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

## బైక్‌ను ఢీకొన్న కారు

జూలూరుపాడు: మండలంలోని వినోభానగర్ సమీపంలో తల్లాడ – కొత్తగూడెం ప్రధాన రహదారిపై బైక్‌ను కారు ఢీకొన్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పాల్వంచ మండలం పూసుగూడెంనకు చెందిన ధరావత్ ప్రవీణ్ బైక్‌పై ఖమ్మం నుంచి పాల్వంచ వెళ్తున్నాడు. వినోభానగర్ గ్రామం దాటిన తరువాత ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టడంతో ప్రవీణ్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రవీణ్ హెల్మెట్ ధరించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మౌలాన (ఫైల్)

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. చంద్రుగొండకు చెందిన ఎస్కే మౌలాన (70) అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంటలో ఉంటున్నాడు. మధ్యాహ్నం తన ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో సత్తుపల్లి నుంచి బొగ్గులోడుతో కొత్తగూడెం వైపు వెళ్తున టిప్పర్ ఢీకొట్టింది. దీంతో మౌలానా అక్కడికక్కడే మృతిచెందగా.. వేగంగా వెళ్తున్న టిప్పర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మృతుడి కుటుంబీకులు, స్థానికులు జాతీయ రహదారిపై బైఠాయించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆందోళనకారులను శాంతింపజేశారు. మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం కొత్తగూడెంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ నాగరాజు తెలిపారు. మృతుడికి భార్య, ఏడుగురు పిల్లలు ఉన్నారు.

## మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

భద్రాచలంఅర్బన్: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో ముద్దాయికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి మంగళవారం తీర్పునిచ్చారు. భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ముదిగొండ రామకృష్ణ 2022 ఏప్రిల్ 22న ఓ గర్భిణికి సిజేరియన్ చేస్తున్న సందర్భంలో ముద్దాయి గుర్రం లాల్‌ఖాన్ సదరు మహిళతో అవమానకరంగా ప్రవర్తించాడని భద్రాచలం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా పూర్వాపరాలు పరిశీలించిన జడ్జి శివనాయక్ మంగళవారం పైవిధంగా తీర్పునిచ్చారు.

## అక్రమంగా మట్టి తవ్వుతున్న జేసీబీ సీజ్

దమ్మపేట: అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలకు పాల్పడుతున్న జేసీబీని రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. మండలంలోని అప్పారావుపేట శివారులో మంగళవారం అనుమతులు లేకుండా జేసీబీ యంత్రంతో మట్టిని తవ్వి, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. గ్రామస్తులు తవ్వకాలను అడ్డుకుని, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఆర్‌ఐ భిక్షం జేసీబీని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.



జేసీబీని అడ్డుకుంటున్న గ్రామస్తులు

# ప్రతీ అవకాశం సద్వినియోగం చేసుకోవాలి



దుమ్ముగూడెం: ములకపాడులోని రన్నింగ్‌ట్రాక్‌ను పరిశీలిస్తున్న పీఓ రాహుల్, అధికారులు

భద్రాచలం: విద్యార్థులు విద్యతో పాటు ఇతర రంగాల్లో వచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాణించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. మంగళవారం ఐటీడీఏ ప్రాంగణంలోని కేజీబీవీలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమానికి పీఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలో కావాల్సిన జ్ఞానాన్ని సంపాదించటం ద్వారా ఉన్నత విద్య సులభతరం అవుతుందన్నారు. క్యాంపుల ద్వారా నేర్చుకున్న అంశాలను నిత్య జీవన శైలిలో అమలు పర్చాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వరచారి, ఎంఈఓ రమ,కొత్తగూడెం జీసీడీఓఅన్నామణి,విద్యార్థినులు పాల్గొన్నారు.

**దుమ్ముగూడెంలో..**

దుమ్ముగూడెం: గిరిజన విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొని అంతర్జాతీయస్థాయిలో రాణించడానికి అన్ని సౌకర్యాలతో కూడిన క్రీడా ప్రాంగణాలు అవసరమని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. మంగళవారం మండలంలోని ములకపాడు, ములకనపల్లిలో నిర్మిస్తున్న క్రీడా ప్రాంగణం, కమ్యూనిటీ హాల్, ఇండోర్ స్టేడియాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. పోలీస్ శిక్షణ తీసుకునే విద్యార్థులకు 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ నిర్మించాలన్నారు. రూ.10 లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ చంద్రశేఖర్, టీఏ శ్రీనివాస్, ఏఈ రవి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను పటిష్టపర్చాల్సి ఉంది..

**టీపీసీసీ ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్‌రెడ్డి**



ఇల్లెందు: మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్‌రెడ్డి

ఇల్లెందు/మణుగూరుటౌన్: దేశంలో కాంగ్రెస్ పార్టీ చాలా బలహీనంగా ఉందని, గ్రామస్థాయి నుంచి పటిష్టపర్చాలని, ఇలాంటి తరుణంలో కాంగ్రెస్‌కు పూర్తిస్థాయి కార్యకర్తలు అవసరమని టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ పి.శ్రావణ్‌కుమార్‌రెడ్డి, ప్రదాన కార్యదర్శి ప్రమోద్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం పట్టణంలోని ఐతా ఫంక్షన్ హాల్‌లో డీసీసీ అధ్యక్షులు పొదెం వీరయ్య అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ సంస్థాగత కమిటీల పదవులకు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని, దేశంలో అధికారం సాధించి, రాహుల్‌ను ప్రధానిని చేసేందుకు ప్రతీ కార్యకర్త పోరాడాలని కోరారు. అందుకోసం ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి సూచనలతో గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పటిష్టం చేయాల్సి ఉందన్నారు. 2017 పూర్వం నుంచి పార్టీలో ఉన్న వారికి పదవులు వస్తాయని, దరఖాస్తులు పరిశీలిస్తామని చెప్పారు. అనంతరం డీసీసీ అధ్యక్షులు పొదెం వీరయ్య, ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడారు. డానియేల్, పులి సైదులు, దేవానాయక్, రవికుమార్, జిల్లా కిసాన్ కమిటీ అధ్యక్షులు ఏలూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, మణుగూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన నియోజకవర్గస్థాయి సమావేశానికి డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా.. శ్రావణ్ కుమార్‌రెడ్డి, ప్రమోద్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ఏ, బీ బ్లాక్ అధ్యక్షుల ఎంపికకు దరఖాస్తులు స్వీకరించారు.

# ఇద్దరు ఆపరేటర్లపై వేటు..

- కేఎంసీలో డిజిటల్ కీ దుర్వినియోగంతో చర్యలు
- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు షోకాజ్ నోటీసులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థలో కీలక విభాగమైన రెవెన్యూ విభాగంలో కంప్యూటర్ ఆపరేటర్ల అక్రమాలు ఒక్కటొక్కటిగా బయటపడుతున్నాయి. ఇటీవల అందిన ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యాన విచారణ అనంతరం ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లను అధికారులు తొలగించినట్లు తెలిసింది. ఇంటి నంబర్ల కేటాయింపులో అధికారులు తిరస్కరించిన ఫైళ్లకు ఆన్‌లైన్‌లో అనుమతులు జారీ చేయడంతో ఈ చర్య తీసుకున్నట్లు సమాచారం. రెవెన్యూ విభాగం అధికారులతో పాటు కంప్యూటర్ ఆపరేటర్లపై అనేక ఆరోపణలు ఉన్నా ఇన్నాళ్లు చర్యలు తీసుకోలేదు. ఎట్టకేలకు అధికారులు కొరడా ఝుళిపిస్తూనే, రెవెన్యూ విభాగాన్ని ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

**పలు అక్రమాలు గుర్తింపు**

రెవెన్యూ విభాగం అధికారులు, ఆపరేటర్లపై వస్తున్న ఆరోపణల నేపథ్యాన అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా కొన్ని రోజులుగా విచారణ చేశారు. ఇంటి నంబర్ల కేటాయింపు, వీఎల్‌టీ ట్యాక్సులు, కోర్టు కేసులో ఉన్న ఫైళ్లకు మ్యుటేషన్లు చేయడం తదితర అక్రమాలు నిజమేనని తేలడమే కాక డిజిటల్ కీ దుర్వినియోగానికి పాల్పడినట్లు గుర్తించారు. దీంతో ఆపరేటర్లు సందీప్, సునీతను సర్వీస్ తొలగించేలా అసిస్టెంట్ కమిషన్ సిఫారసు చేశారు. అనంతరం మదర్ థెరిస్సా కంప్యూటర్ ఆపరేటర్ల గ్రూప్ లీడర్లు, సభ్యులు మంగళవారం తీర్మానం చేసి సమర్పించడంతో వీరిద్దరిని తొలగించారు.

**షోకాజ్ నోటీసులు**

డిజిటల్ కీలు దుర్వినియోగం, విభాగంలో అక్రమాలు జరుగుతున్నా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నిర్లక్ష్యంగా ఉండడంపై కమిషనర్ సీరియస్ అయినట్లు తెలిసింది. విధుల్లో అలసత్వం ప్రదర్శించిన ఇద్దరు ఆర్‌ఐలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం అంతేకాక అక్రమాలపై మరింత లోతుగా విచారణ జరిపించడమే కాక డిజిటల్ కీ దుర్వినియోగానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

**ఆర్‌ఓ రిలీవ్**

ఇటీవల మహబూబాబాద్‌కు డిప్యూటేషన్‌పై బదిలీ అయిన ఆర్‌ఓ జి.శ్రీనివాసరావును కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య రిలీవ్ చేశారు. ఆర్‌ఓ డిప్యూటేషన్‌ను రద్దు చేయించి ఇక్కడే కొనసాగిస్తారని అంతా భావించారు. కానీ ఆయనను రిలీవ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇదే సమయాన మేనేజర్ బుచ్చిబాబుకు ఇన్‌చార్జి ఆర్‌ఓగా బాధ్యతలు కేటాయించారు.